# పేషెంట్ చెప్పే కథలు

ప్రాగమంచు తెరల వెనుక మెరుస్తున్న ఆకాశపు వెండి చాందినీ. సుశిక్షితులైన సైనికులా ఒక వరసలో ఎగురుతున్న పక్షుల గుంపు. యౌవన భారంతో వంగుతున్న కన్నెపిల్లల్లా కొబ్బరిచెట్ల సమూహం. గుండెల్లో ప్రతిధ్వనిస్తున్న గుడిగంటలు.


సూర్య కిరణాల స్పర్శతో తూర్పు చెక్కిళ్ళు కందాయి. నిద్రలేస్తున్న నగరపు రొద ప్రాతఃకాల ప్రశాంతతను భగ్నం చేస్తోంది. కళ్ళు విప్పుతున్న చైతన్యం చీకటి చారికల్ని తుడిచేస్తోంది. బ్రతుకు యుద్ధం పునఃప్రారంభమవుతోంది.

కెవ్వుమని కేకవినపడడంతో ఆతృతగా మెట్లు దిగింది శ్రుతి. పది మంది ఆడవాళ్లు గాభరాగా ఆమెను చుట్టేశారు. వారి మాటలు వింటూ పరిశీలనగా చూస్తోందామె. దోసెడు వెడల్పున్న జరీ చీరలు. ఒక్కొక్కరి వంటిమీద అధమపక్షం ఏభై తులాల బంగారం. వాళ్ళ ముఖాల్లో డబ్బు వల్ల వచ్చిన దర్పం. అభిజాత్యం.

"అమ్మా!" పక్కకు తిరిగింది శ్రుతి.

"పిల్ల కడుపు గుండెలకు తాచేసిందని గోలెడతాంది. తమరోసారి చూడండమ్మా!" చిరిగి పీలికలై, అతి కష్టంమీద ఆమె శరీరాన్ని కప్పుతున్న గుడ్డలు. ఎండి కృశించిన శరీరం. ఆమె కళ్ళల్లో భయం. దైన్యం. దుఃఖం.

పక్క గదిలో మంచంమీద పడుకుని పురిటి నొప్పుల్ని పళ్ళ బిగువున శబ్దం




బయటికి రాకుండా భరిస్తుందా అమ్మాయి. పరీక్ష చేసి. పురుడు త్వరగా వచ్చేస్తుందని ధైర్యం చెప్పి డెలివరీ రూమ్‌లో వున్న కలవారి అమ్మాయి కవిత దగ్గరకు వచ్చింది శ్రుతి.

"నాకు మత్తింజక్షనివ్వండి డాక్టర్! నేను పడలేనీబాధని" పెద్దగా ఏడుస్తూ శ్రుతి చెయ్యి పట్టుకుని ప్రాధేయపడసాగింది.

"ఇంకెంతోసేపు పట్టదు. వచ్చేస్తుందమ్మా!"

"ఇందాకటినుండి మీరలా అంటూనే వున్నారు. ఈ నొప్పుల్తో నా ప్రాణం పోతూంది. ప్లీజ్. ఆపరేషన్ చేసి తీసెయ్యండి డాక్టర్!" కేకలు పెడుతూ, ఏడుస్తూ అడిగింది కవిత. కవిత బంధువులంతా బయటినుండి యధాశక్తి తమ ఆదుర్దాను వ్యక్తం చేస్తున్నారు. కవిత తల్లి కూతురు కెవ్వుమన్నప్పుడల్లా మిన్ను విరిగి మీదపడినంత హంగామా చేస్తూంది.

వాళ్ళ గొడవకు నవ్వొస్తూంది. చికాగ్గా వుంది. బాధగానూ వుంది. పెళ్ళయాక గర్భం వస్తుందని. నెలలు నిండాక పురుడొస్తుందని. పురుడొచ్చేప్పుడు నొప్పులొస్తాయని. నొప్పులొచ్చేప్పుడు ఓర్చుకుంటూ శిశువు ప్రయాణం పూర్తిచేసి ఈ లోకంలోకి రావడానికి తన వంతు ప్రయత్నం తను చెయ్యాలని. తమ సానుభూతితో,అర్థంలేని మాటలతో ఆ అమ్మాయిని భయపెట్టడంకాక. దగ్గర వాళ్ళంతా యివన్నీ సహజమైనవేనని నచ్చచెప్పి ఆమె మనోధైర్యం పెంచాలని ఎప్పటికి అర్థం చేసుకుంటారు?

ఓదారుస్తూ, ధైర్యం చెప్తూ. సహాయం చేస్తూ. శిశువు బయటకు వచ్చాక సంతోషంగా వూపిరి పీల్చింది శ్రుతి.

"డాక్టర్! ఏం బిడ్డ?" ఆతృతగా అడిగింది కవిత.

"ఆడపిల్ల" ఒక్కసారి పెద్దపెట్టున కవిత వెక్కి వెక్కి ఏడవటం చూసి నిర్ఘాంతపోయింది శ్రుతి.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావు."


"ఆడపిల్లయితే ఆయన నా ముఖం చూడనన్నారు." కవిత జవాబువిని షాక్ తింది శ్రుతి. మొదటి బిడ్డకే ఈ సంపన్నురాలింత దుఃఖపడుతూంటే. మళ్ళీ మళ్ళీ ఆడపిల్లే పుడితే!!

"సరదాకి. నేళాకోళానికి అలా అనుంటారతను" తేల్చేయబోయింది శ్రుతి.

"మీకు తెలీదు డాక్టర్ ఆయన సంగతి. ఆయన సీరియస్‌గానే అన్నారు. అన్నంత పని చేయాలనే మొండి మనిషి కూడా. అసలు మా అత్తవారింట్లో అంతా అదే సజ్జు. ఆడపిల్లయితే ఆస్తి పట్టుకుపోతుందని ఏడుపు." భర్తను. అత్తవారిని తలచుకున్న కవిత ముఖంలో బాధల నీడలు. కళ్ళల్లో కన్నీటి వరదలు. శ్రుతి మనసంతా చేదుగా అయింది.


ఆమె ఎంత అజ్ఞానంలో వుందో, ఎంత తప్పు ధోరణిలో ఆలోచిస్తోందో ఆ మూర్ఖురాల్నెలా ఎదిరించి నిలబడాలో విడమరచి చెప్పి కవిత ఏడుపు మానేలా చేసింది శ్రుతి.

కవితని రూమ్‌లోకి పంపగానే నొప్పులు పడుతున్న రెండో అమ్మాయిని బల్ల మీద కెక్కించారు. సరైన పోషణ లేక. రాత్రంతా నిద్రలేక. బలహీనంగా. అలసటగా వుందామె. జాలిగా ఆమెవంక చూస్తూ గ్లవ్ చేతికి తొడుక్కుంటూంది శ్రుతి.



"ఏమ్మా! ఏం బిడ్డ కావాలి?" అడిగిందా అమ్మాయిని. ఈ బల్లమీద పడుకుని మొదటి బిడ్డను కనే ప్రతి తల్లి జవాబూ ఆమెకు స్పష్టంగా తెలుసు — "మగపిల్లాడు." ఎప్పుడో, ఎక్కడో ఒక్క మినహాయింపు. కుతూహలంగా ఆమె వంక చూస్తూంది శ్రుతి.

'ఏ బిడ్డయినా నాబిడ్డేకదమ్మా! ఎవరైనా పరవాలేదు. నిండు ఆయుషుతో సుఖంగా బతికితే చాలు" ఆ అమ్మాయి, నీలవేణి కళ్ళల్లో ఉషస్సు తొంగి చూసినట్లనిపించింది శ్రుతికి.



davp 80/38